ప్రజాశక్తి

బుధవారం 23 ఏప్రిల్ 2025 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

ఉలిక్కిపడ్డ ఒంగోలు



హత్య జరిగిన ప్రదేశం (వీరయ్య చౌదరి ఆఫీస్)

- మాజీ ఎంపీపీ వీరయ్యచౌదరి దారుణహత్య
- శరీరంపై 38 కత్తి పోట్లు..
- మద్యం వ్యాపారాల్లో ఆర్థిక లావాదేవీలే కారణమని అనుమానం
- ఘటనపై గొట్టిపాటితో ఫోన్‌లో మాట్లాడిన సిఎం చంద్రబాబు
- ఈదర హరిబాబుకు గుండెపోటు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఒంగోలు నగరం మంగళవారం రాత్రి ఉలిక్కిపడింది. నాగులుప్పల పాడు మండల మాజీ ఎంపీపీ, తెలుగుదేశం నేత ముప్పవరపు వీరయ్యచౌదరి(49) దారుణహత్యకు గురయ్యారు. ఒంగోలులోని జాతీయ రహదారిపై పద్మ టవర్స్ సమీపంలో ఆయన కార్యాలయంలో రాత్రి ఏడున్నర గంటల సమయంలో నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి.. కత్తులతో విచక్షణారహితంగా పొడిచి.. చంపేశారు. శరీరంపై 38 కత్తిపోట్లు ఉన్నాయి. ఆయన కింద పడిపోగానే నలుగురు నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. ఆఫీసులో పనిచేసే ఒకరిద్దరూ భయ భ్రాంతులకు గురయ్యారు. వెంటనే చుట్టు పక్కల దుకాణాల వాళ్లు వెళ్లి గాయాలతో పడి ఉన్న వీరయ్యను అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు. రిమ్స్‌కు తీసుకుపోగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటన ఒంగోలులో సంచలనంగా మారింది. మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబుకు స్వయానా మేనల్లుడు. ఈ హత్యకు మద్యం వ్యాపారాల్లో ఆర్థిక లావాదేవీలే కారణంగా అనుమానిస్తున్నారు. రియల్‌ఎస్టేట్ ▶ 2లో



వీరయ్య చౌదరి (ఫైల్)



వీరయ్య చౌదరి శరీరంపై కత్తి పోట్లు



వీరయ్యచౌదరి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల, బిఎన్..

ధాన్యం కొనుగోళ్లకు చర్యలు

కలెక్టర్ వెంకటమురళి ▶ 2లో

రైలు కిందపడి ప్రేమజంట ఆత్మహత్య

కడవకుదురు రైల్వేస్టేషన్ సమీపంలో ఘటన

ప్రజాశక్తి-చీరాల

ప్రేమ వివాహానికి కుటుంబ పెద్దలు అంగీకరించరేమో అన్న భయంతో ఓ ప్రేమ జంట రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చినగంజాం మండలం, కడవకుదురు రైల్వేగేట్ సమీపంలో మంగళవారం వేకువజామున జరిగింది. చీరాల రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చినగంజాం మండలం, కొత్తపాలెంకు చెందిన రామచంద్రారెడ్డి కుమారుడు రాజు మణికంఠరెడ్డి (21) ఒంగోలులోని ఐటిఐ కళాశాలలో సెకండియర్ చదువుతున్నాడు. అయితే అదే గ్రామానికి చెందిన జాహ్నవి(19) ఇంటర్ ఫెయిల్ కావడంతో ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటోంది. వీరిద్దరూ ఒకే గ్రామానికి, ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు. వీరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. తమ ప్రేమ విషయాన్ని కుటుంబ సభ్యులకు



జాహ్నవి, మణికంఠరెడ్డి (ఫైల్)

చెబితే అంగీకరిస్తారో, లేదో అనే భయంతో ప్రేమికులిద్దరూ కలిసి చనిపోదామని నిర్ణయించుకున్నారు. చిన్నగంజాం మండలం కడవకుదురు రైల్వే స్టేషన్ సమీపంలో వేకువ జామున రైల్వే ట్రాక్‌పై రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికులు మృతదేహాలను గమనించి.. రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రేమికులు తీసుకొచ్చిన ద్విచక్రవాహనాన్ని పోలీసులు గుర్తించి.. స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కుటుంబసభ్యుల నుండి పోలీసులు వివరాలు సేకరించి.. ఇద్దరి మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. తమ బిడ్డలు చదువుకొని ఉన్నత స్థానంలో ఉంటారని ఆశించిన తల్లిదండ్రులకు ప్రేమ పేరుతో రైల్వే ట్రాక్‌పై మతదేహాలే కనిపించడంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. ప్రేమజంట ఆత్మహత్యతో కొత్తపాలెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పొగాకు రైతులను ఆదుకుంటాం..

- మంత్రి బాల వీరాంజనేయ స్వామి
- పొగాకు వేలం కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పొగాకు రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. మంగళవారం ఉదయం ఒంగోలులోని పొగాకు వేలం కేంద్రాన్ని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్. విజయ కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పొగాకు కొనుగోళ్లపై బోర్డు అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లలో ఎదురవుతున్న ఇబ్బందులు, ధరల గురించి రైతులు, రైతుసంఘం నాయకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి విలేకరులతో మాట్లాడుతూ నోబిడ్లు, ధరల గురించి కొనుగోలుదారులతో ఒక సమావేశం ఏర్పాటు చేసి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. రైతులు నష్టపోకుండా అన్ని విధాలా ఆదుకుంటామన్నారు.



లేబర్ కోడ్స్ రద్దు కోసం..

20న దేశవ్యాప్త సమ్మె

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కార్మికవర్గానికి హాని చేకూర్చే లేబర్ కోడ్స్ రద్దు కోరుతూ మే 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం నాడు సిఐటియు ప్రకాశం జిల్లా విస్తత సమావేశం ఒంగోలు సిఐటియు కార్యాలయంలో జరిగింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ లేబర్ కోడ్స్ కార్మిక వర్గంపై రుద్దడం పెట్టుబడిదారులకు అత్యంత లాభాలు అందించేందుకే అన్నారు. క్రోనీ క్యాపిటలిజం ద్వారా అత్యధిక లాభాలు గడించడానికేనని, ఇప్పుడు ఉన్న కార్మిక చట్టాలు ఏదో మేరకు ఆటంకంగా ఉన్నాయని, అందుకే కేంద్ర ప్రభుత్వం వాటి స్థానంలో లేబర్ కోడ్స్ తెచ్చిందని పేర్కొన్నారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాల లోపాలను తొలగించి యావత్తు కార్మిక వర్గానికి ఉపయోగపడే లేబర్ కోడ్స్ తెస్తామని జాతీయ మీడియాలో వక్రీకరించిందన్నారు. 29 కార్మిక చట్టాలను మార్చి 2019లో వేతనాల కోడ్స్, 2020లో పారిశ్రామిక



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

సంబంధాలు, సామాజిక భద్రత కోడ్స్ వత్తి, భద్రత, ఆరోగ్యం పని పరిస్థితుల కోడ్స్ అనే మూడు కోడ్స్ తెచ్చిందని తెలిపారు. లేబర్ కోడ్స్ అమలులోకి వస్తే 29 కార్మిక చట్టాలు రద్దు అవుతాయన్నారు. 2025లో ఏ రోజయినా అమలు చేయడానికి కేంద్రం రంగం సిద్ధం చేస్తుందని, దీనిని అడ్డుకోవడానికి కార్మిక వర్గం నిరవధిక పోరాటానికి సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యం.రమేష్, జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు పి కల్పన, జివి కొండారెడ్డి, నగర కార్యదర్శి టి.మహేష్ పాల్గొన్నారు.



ఘటనపై మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఉలిక్కిపడ్డ ఒంగోలు

(మొదటిపేజీ తరువాయి)

తగాదాలు కూడా ఉన్నాయనే చర్చ సాగుతోంది. హత్యలో పాల్గొన్న నేరస్తులు వృత్తిరీత్యా నేరస్తులా? లేక జిల్లాకు చెందిన వ్యక్తులా? అనేదీ స్పష్టత లేదు. సంఘటన జరిగిన వెంటనే జిల్లా ఎస్పీ దామోదర్, ఎఎస్పీ నాగేశ్వరరావు, డిఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. హత్య జరిగిన తీరును పరిశీలించారు. చుట్టుపక్కల వారినడిగి.. ఏం జరిగిందో అడిగి తెలుసుకున్నారు. దుకాణాలకు ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు హడావుడిగా పరిశీలించారు. నేరస్తుల జాడ కనిపించలేదు. వీరయ్య ఆఫీసు కనిపించేలా ఎక్కడా సీసీ కెమెరాలు అందుబాటులో లేవు. దీంతో నేరస్తుల ఆనవాళ్లు కూడా సీసీ కెమెరాల్లో కనిపించలేదు. జాగిలాలను కూడా రంగంలోకి దించారు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఒంగోలులో చాలా ఏళ్ల తర్వాత ఓ అధికారపార్టీ నేత హత్య జరగడం చర్చగా మారింది. తెలుగుదేశం కార్యకర్తలు పెద్దఎత్తున అక్కడకు చేరుకున్నారు. ఇక రిమ్స్‌కు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, బిఎన్.విజయ్‌కుమార్ చేరుకొని వీరయ్య మృతదేహాన్ని పరిశీలించారు.

నేరస్తులను వీలైనంత త్వరగా పట్టుకుంటాం ఎస్పీ దామోదర్

మాజీ ఎంపీపీ వీరయ్యను హత్యచేసిన హంతకులను వీలైనంత త్వరగా పట్టుకుంటామని ఎస్పీ దామోదర్ వెల్లడించారు. సంఘటనా స్థలంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి కత్తులతో పొడిచి చంపినట్లు తెలుస్తోందన్నారు. దీని వెనుక ఎవరు ఉన్నారనేది దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇందుకోసం నలుగురు సిఐలతో ప్రత్యేకబృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

మంత్రి గొట్టిపాటితో మాట్లాడిన సిఎం

వీరయ్య చౌదరి హత్య విషయం తెలిసి.. రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వీరయ్య చౌదరి హత్యను ఖండించారు. ఘటనపై ఎస్పీ దామోదర్‌తో ఫోన్ లో మాట్లాడారు. అమరావతి నుంచి హుటాహుటిన ఒంగోలుకు బయలుదేరారు. పార్టీకి ఎంతో విధేయుడిగా పని చేసిన వీరయ్య మరణం కలచివేసిందన్నారు. నిందితులను కఠినంగా శిక్షిస్తామని, వీరయ్యచౌదరి కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు.

సిఎం చంద్రబాబు ఆరా

వీరయ్యచౌదరి హత్య విషయం తెలుసుకున్న సిఎం చంద్రబాబు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫోన్ చేసి.. ఘటనపై ఆరా తీశారు. ఘటన వివరాలను గొట్టిపాటి ద్వారా తెలుసుకున్నారు.

ఈదర హరిబాబుకు గుండెపోటు



వీరయ్యచౌదరి హత్య వార్త విని.. అతని మేనమామ ఈదర హరిబాబుకు గుండె పోటు వచ్చింది. ఆయన పరిస్థితి విషమంగాఉన్నట్లు సమాచారం.

పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవం

ప్రజాశక్తి-తర్లుపాడు

మండలంలోని లింగారెడ్డికాలనీ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవం ప్రధాన ఉపాధ్యాయులు షేక్ మౌలాలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో తిరిగి బడి ఈడు పిల్లల నమోదు, ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించాలని, పిల్లల బంగారు బాల్యం బంగారు భవితకు బాటలు వేయాలని, గ్రామంలో కరపత్రాలతో అవగాహన ర్యాలీ చేశారు. పిల్లల ప్రోగ్రెస్ కార్డ్సను తల్లిదండ్రులకు అందజేశారు. విద్యార్థులను పై తరగతులకు ప్రమోట్ చేస్తున్నట్లు విద్యార్థులకు, తల్లిదండ్రులకు తెలియజేసి నూతన విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ షేక్షావలి, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గిన్నిస్ రికార్డులో స్థానం

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం, అనుములపల్లె గ్రామానికి చెందిన పాస్టర్ పి మనోజ్‌కుమార్ గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించారు. 2024 డిసెంబర్ 1న ప్రపంచ స్థాయి సంగీత కార్యక్రమం జరిగింది. 18 దేశాల నుంచి 1090 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆన్లైన్ ద్వారా కీబోర్డ్‌పై సరళి స్వరాలు వాయించగా, 1046 మంది అర్హత సాధించారు. అందులో అనుములపల్లి గ్రామం గ్రేస్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చ్‌లో పాస్టర్‌గా కొనసాగుతున్న మనోజ్‌కుమార్ అర్హత సాధించారు. హైదరాబాద్ ది లైఫ్ చర్చిలో జరిగిన కార్యక్రమంలో మనోజ్‌కుమార్ గిన్నిస్ రికార్డ్ సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈ గుర్తింపు ఎంతో ఘనతను తెచ్చిందని అన్నారు.

ప్రజాశక్తి
బుధవారం 23 ఏప్రిల్ 2025



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

సమీక్ష సమావేశంలో మంత్రి స్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

కొండపి నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు ఇబ్బంది లేకుండా మంచి నీరు సరఫరా చేయాలని సంబంధిత అధికారులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆదేశించారు. మంగళవారం తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో కొండపి నియోజకవర్గ గ్రామీణ నీటి సరఫరా అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి దృష్ట్యా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా మంచినీరు అందించాలన్నారు. నియోజకవర్గంలో ఎంత నీరు అవసరం ఉంది, నీటి సరఫరాకు ఏమైనా సమస్యలున్నాయా అని సంబంధిత విషయాలను అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. అధికారులంతా బాధ్యతాయుతంగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా మంత్రి అన్నారు. సమీక్ష సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా ఎస్ఇ బాల శంకర్, డీఈ వేణుగోపాల్, ఏఈలు సిహెచ్ వెంకటేశ్వర్లరావు, రమేష్, జాన్‌పాల్ రాజ్, యన్.మహేంద్ర పాల్గొన్నారు.

పుష్కర్ ఘాట్‌లో పడి మహిళ మృతి

ప్రజాశక్తి-రేపల్లె

ప్రమాదవశాత్తు నదిలో పడి మహిళ మృతి చెందిన సంఘటన రేపల్లె మండలం పెనుమూడి పుష్కర్ ఘాట్ వద్ద మంగళవారం జరిగింది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. వట్టిచెరుకూరు మండలం గార పాడు గ్రామానికి చెందిన పోలూరి ధనలక్ష్మి (74) సోమవారం సాయంత్రం కృష్ణా నది పుష్కర్ ఘాట్ వద్దకు వచ్చి నదిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు.

నాగంపల్లిలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని నాగంపల్లి, నాయుడుపేట గ్రామాలలో మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటుకు ఐదు తరగతులకు ఐదుగురు టీచర్ల నియామకం జరిగిందని మండల విద్యాశాఖ అధికారి-2 బరిగే నరసింహారావు మంగళవారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను విద్యార్థులకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు వాటి ప్రయోజనాలను తల్లిదండ్రులకు గ్రామ పెద్దలకు వివరించారు. నాగంపల్లిలో ప్రతిపాదిత ఉన్నత పాఠశాల గురించి విద్యార్థులు అందరిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని గ్రామస్తులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జెవి.నాయక్, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, సిఆర్‌పి శ్రీనివాసులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-కురిచేడు

మహిళ హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కురిచేడు మండలంలోని బోధనంపాడు గ్రామాల సరిహద్దుల్లో ఈ నెల 13వ తేదీన నన్నెబోయిన లక్ష్మీ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్య కేసును పోలీసులు ఛేదించారు. త్రిపురాంతకం సిఐ హస్సేన్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. దర్శి మండలంలోని రాజంపల్లి గ్రామానికి చెందిన మాణికల ఏడుకొండలు పొదిలి డిపోలో ఆర్.టి.సి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. లక్ష్మీతో గత 20 సంవత్సరాల నుంచి సహ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ మధ్య కాలంలో లక్ష్మీపై అనుమానం పెంచుకొని ఆమెను కురిచేడు, బోధనంపాడు గ్రామాల సరిహద్దులోకి తీసుకొచ్చి హత్య చేశాడు. విచారణలో చేసిన నేరాన్ని అంగీకరించాడని నిందితుడిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరుస్తామని సిఐ తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో కురిచేడు ఎస్ఐ యం.శివ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సిఐ హుస్సేన్



దొంగలను చూపుతున్న పోలీసులు

సెల్ టవర్లలో బ్యాటరీ దొంగలు అరెస్టు

ఇంకొల్లు: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాలలో సెల్ టవర్లలో బ్యాటరీలు దొంగిలించిన నలుగురు దొంగలను ఎట్టకేలకు ప్రకాశం జిల్లా పోలీసులు పట్టుకున్నారు. ఇంకొల్లు మండలం గంగవరం గ్రామానికి చెందిన షేక్ జియాఉద్దీన్, షేక్ జాన్ వలీ, పంగులూరుకు చెందిన కారుమంచి కాసిం, మార్టూరు మండలం ద్రోణాల గ్రామానికి చెందిన కాటూరి జాలయ్యలు కలిసి ఇంకొల్లు మండలం నాగండ్ల, పంగులూరు మండలం బోధవాడ, గ్రామాలతో పాటు పర్చూరు, చినగంజాం మండలాలలో సెల్ టవర్లలో బ్యాటరీలు దొంగతనం చేశారు. సెల్ టవర్ల గ్రేస్ పర్యవేక్షణ మేనేజర్ ధార అంజయ్య ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన ముండ్లమూరు ఎస్ఐ కె.కమలాకర్ ఆధ్వర్యంలోని వేంపాడు వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.4 లక్షల 40 వేల విలువైన సొమ్మును రికవరీ చేసినట్లు తెలిపారు.

క్రైమ్ కాలమ్

ప్రకృతి వ్యవసాయంతో సుస్థిర ఆదాయం

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రకృతి వ్యవసాయమే రైతుకు ప్రయోజనకరం, ప్రజలకు ఆరోగ్యకరమని ప్రకృతి వ్యవసాయ అధికారి వెంకట్రావు అన్నారు. మండలంలోని ఎం.నిడమనూరు గ్రామంలో ఖరీఫ్ యాక్షన్ ప్లానింగ్‌లో భాగంగా రైతులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ గోఆధారిత, సేంద్రీయ సాగుతో పండించే పంటల ఆహార ఉత్పత్తులతోనే మానవాళికి ఆరోగ్యం అన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు గురించి, లాభాల గురించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్ ఇంచార్జ్ వెంకట్రావు, విజయలక్ష్మి మాట్లాడుతూ రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకంతో పండించే పంటలతో తయారుచేసే ఆహార ఉత్పత్తులు విషపూరితమై మనుషుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందన్నారు. ఆహార పదార్థాలను ఉత్పత్తి చేసి భవిష్యత్ తరాలకు ముప్పు కలిగించవద్దని సూచించారు. సేంద్రీయ సాగు చేసిన ఉత్పత్తులకు బహిరంగ మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. విఏఏ సుభాషిని మాట్లాడుతూ ప్రతి మహిళా రైతు ఇంటిదగ్గర స్థలంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకొని ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని తెలియజేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సుజాత మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. రాబోయే రోజుల్లో ప్రకృతి వ్యవసాయమే ప్రధానమవుతుందని, రైతులు కూడా ముందుకు రావాలని ఆమె సూచించారు. అనంతరం గ్రామంలో మూడు సంవత్సరాల నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న రైతు శేఖర్‌ను శాలువతో సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమానికి గ్రామ రైతులు, సచివాలయ సిబ్బంది, విఏఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది యూనిట్ ఇన్‌ఛార్జి విజయలక్ష్మి, ఐసిఆర్‌పిలు శశి, పద్మావతి, మరియమ్మ, కవిత, జ్యోష్న, రమాదేవి, త్రివేణి, హరిత పాల్గొన్నారు.



రైతు శేఖర్‌ను సన్మానిస్తున్న అధికారులు

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల



మృతి చెందిన ఏసుదానం

దోర్నాల మండలంలోని గంటవానిపల్లె గ్రామంలో మంగళవారం విషాదం చోటు చేసుకుంది. యలక పాటి ఏసుదానం(40) తన గృహంలో టేబుల్ ఫ్యాన్ స్విచ్ వేస్తుండగా కరెంట్ హైవోల్టేజ్ రావడంతో చేతికి ఫ్యాన్ వైర్ తగిలి షాక్ కొట్టడంతో ఒక్కసారిగా కింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన పెద్ద దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారు. ఏసుదానం మృతితో గ్రామంలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకున్నాయి. ఏసుదానంకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె, భార్య ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


ఆసుపత్రి పైనుంచి దూకి సాధువు ఆత్మహత్య

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్



సాయికుమార్ మృతదేహం

గిద్దలూరు ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాల మొదటి అంతస్తు నుంచి దూకి మంగళవారం సాయి కుమార్(63) అనే సాధువు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు బెంగళూరుకు చెందిన వ్యక్తి కాగా గత కొంతకాలంగా గిద్దలూరు ప్రాంతంలో సాధువుగా భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నాడు. రెండు రోజుల క్రితం ఆటో తగిలిందని ఆసుపత్రిలో చేరి వైద్యము పొందుతూ తనకు ఆరోగ్యం బాగాలేదని, ఆత్మహత్య చేసుకుంటానని తోటి రోగులతో చెప్పి మంగళవారం ఆసుపత్రి పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.



బోల్తా పడిన బస్సును క్రేన్ సహాయంతో తీస్తున్న దృశ్యం

ఆర్‌టిసి బస్సు బోల్తా

ఏడుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు పంట కాలువలోకి దూసుకెళ్లడంతో ప్రయాణికులకు స్వల్ప గాయాలైన సంఘటన సోమవారం రాత్రి చెరుకుపల్లి గ్రామ శివారులో జరిగింది. వివరాల మేరకు.. తెనాలి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు చెరుకుపల్లి గ్రామ శివారులో ప్రమాదవశాత్తు కాలువలోకి ఒరిగింది. బస్సులో మొత్తం ఏడుగురు ప్రయాణికులు ఉండగా వారికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు సమీపంలోని క్రేన్ సహాయంతో బస్సును బయటకు తీశారు. బస్సు డ్రైవర్ రవికుమార్, కండక్టర్ భాషాలు విషయాన్ని డిపో మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లారు.

చీటింగ్ కేసులో భార్యాభర్తల అరెస్టు

ప్రజాశక్తి - రేపల్లె

చీటీ పాటలువేసి బాధితులకు డబ్బులు ఎగకొట్టిన కేసులో నిందితులైన భార్యాభర్తలను పోలీసులు అరెస్టు చేసినట్లు సిఐ మల్లికార్జునరావు తెలిపారు. రేపల్లె పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిఐ వివరాలు వెల్లడించారు. రేపల్లె పట్టణంలోని మూడో వార్డుకు చెందిన ఉల్లంగుంట రమణ, ఉల్లంగుంట రత్తయ్య కొన్నాళ్ళుగా చీటీపాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొద్దికాలం పాటు డబ్బులు సక్రమం చెల్లించినట్లు తెలిపారు. దీంతో పెద్దసంఖ్యలో ఖాతాదారులు సమకూరారు. ఈ క్రమంలో ఇదే అదునుగా భావించిన భార్య భర్తలు చీటీ పాటల పేరుతో రూ.1.70 కోట్లు బాధితులకు ఇవ్వకుండా ఎగగొట్టినట్లు తెలిపారు. బాధితురాలు వీసం మల్లేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ రాజశేఖర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో విఫలం

పొగాకు క్వింటాకు రూ.37 వేలు ఇవ్వాలి

గిట్టుబాటు కాక తగలబెడుతున్న రైతులు

మాజీ మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-మద్దిపాడు

పొగాకు రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని, కనీస మద్దతు ధర రూ.37 వేలు ప్రకటించాలని మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి డాక్టర్ మేరుగ నాగార్జున డిమాండ్ చేశారు. మండల పరిధిలోని వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. అక్కడ రైతులతో మాట్లాడి వారి బాధలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం రైతులను ఆదుకోకుండా చేతులెత్తేసారన్నారు. కనీస మద్దతు ధర లేదని, క్వింటా రూ.20 వేలకు కూడా కొనడం లేదని అన్నారు. వేలం కేంద్రానికి తీసుకువచ్చిన పొగాకు బేళ్లను సగం బాగాలేదని కారణం చెప్పి వెనక్కి పంపిస్తున్నారని మండిపడ్డారు. నేడు పొగాకును రైతులు అనేకచోట్ల తగలేస్తున్నారని, అందుకు కారణం సరైన ధర లేకపోవడమేనని విమర్శించారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి రూ.200 కోట్లు వెచ్చించి మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకును కొనుగోలు చేశారని గుర్తు చేశారు. రైతుల సంక్షేమం కోసం వైసిపి నిరంతరం పని చేస్తుందన్నారు. వరి రైతులు నేడు ఉరి వేసుకునే పరిస్థితి వచ్చిందని, మిర్చి రైతులు ధరలు లేక అల్లాడిపోతున్నారని అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పొగాకు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పొగాకును పరిశీలించిన వారిలో దుంపా చెంచిరెడ్డి, వేమా శ్రీనివాసరావు, వాకా కోటిరెడ్డి, పల్లకి సత్య నారాయణ రెడ్డి, శ్రీమన్నారాయణ, బుల్లెట్ కృష్ణారెడ్డి, మద్దా లక్ష్మీనారాయణ, బాల ఆంజనేయ రెడ్డి, దుద్దు వినోద్ కుమార్, గుడ్డపాతల రవి, మూరబోయిన సంజీవరావు, నారా సుబ్బారెడ్డి, పిట్ల ఆంజనేయులు, రవణమ్మ, రజిని, సంధ్య, అశోక్ రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న మేరుగ నాగార్జున



దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత దంత వైద్యశిబిరం

ప్రజాశక్తి -యద్దనపూడి

మండల పరిధిలోని అనంతవరం గ్రామములో సిబార్ దంత వైద్యకళాశాల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ వైద్యశిబిరం లో వైద్యశాల ప్రొఫెసర్స్ దేవకి, రాజశేఖర్, 10 మంది పిజి విద్యార్థుల పాల్గొని దంత పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రొఫెసర్ దేవకి వైద్య శిబిరానికి వచ్చిన వారికి పంటి సమస్యలకు గల కారణాలు విరించి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మంచి ఆహారంతో పాటు పాలు, పండ్లు, ఆకు కూరలు తీసుకోవాలన్నారు. మొత్తం 150 మందికి పరీక్షలు చేశారు. వైద్య కళాశాలలో 50 శాతం రాయితీతో చికిత్స చేయించుకోవడానికి కార్డులు అందజేశారు. అనంతరం టూత్ పేస్టు, మౌత్ వాష్, మందులు ఉచితంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ కృష్ణ, పంచాయతీ కార్యదర్శులు మోహన్‌బాబు, తేజ, శివ ప్రసాద్,గ్రామ పెద్దలు వీరయ్య, తారక, వంశీ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.




వాటర్ కూలర్ అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

వాటర్ కూలర్ బహూకరణ

ప్రజాశక్తి-పర్చూరు

స్థానిక బాలికల ఉన్నత పాఠశాలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం వాటర్ కూలర్‌ను బహూకరించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కష్ణమోహన్ కుమారుడు తరుణ్ పుట్టినరోజు సందర్భంగా వాటర్ కూలర్‌ను అందజేసినటుల రోటరీ క్లబ్ సభ్యులు చెప్పారు. అనంతరం విద్యార్థినులు, పాఠశాల సిబ్బంది భోజనం సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కోమటి ఆంజనేయులు, రోటరీ క్లబ్ సభ్యులు నాగబైరు శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి, కోటా శ్రీనివాసరావు, కారుమూడి సుబ్బారెడ్డి, దూలిపల్లి సత్యనారాయణ, పోలిశెట్టి చంద్రశేఖరరావు, కాల్వ సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అవని, పూర్వ ప్రధానోపాధ్యాయురాలు పార్వతి, విద్యార్థినులు,తదితరులు పాల్గొన్నారు.



సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి- వేమూరు : ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మంగళవారం అందజేశారు. మండల పరిధిలోని పెరవలి గ్రామానికి చెందిన జొన్నకూటి రమకుమారికి రూ. 1,24,718, తడికిమళ్ళ భాస్కరరావు కు రూ. 49,292, చదలవాడ గ్రామానికి చెందిన కోటారు తేజ వెంకటరాం చరణ్‌కు రూ. .1,07,400, పెరవలిపాలెం గ్రామానికి చెందిన పుసులూరి రవికిరణ్‌కు రూ. 30,000, చుండూరు మండలం యడ్లపల్లి గ్రామానికి చెందిన వీరంకి నాగలక్ష్మికి రూ. 82,060 చెక్కును అందజేశారు.

ఆపరేషన్ కగార్ పేరుతో..

ఆదివాసులపై మారణకాండ

- మావోయిస్టుల పేరుతో కాల్పులు
- అధాని,అంబానీలకు ఖనిజ సంపద దోచి పెట్టేందుకు కేంద్రం కుట్ర
- క్రైస్తవ,ముస్లిము మైనార్టీపై దాడులను అరికట్టాలి
- ప్రజా సంఘాల నాయకులు



మాట్లాడుతున్న వీరాంజనేయులు

ప్రజాశక్తి- చీరాల

ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆదివాసులపై సృష్టిస్తున్న మారణకాండను వెంటనే ఆపాలని ప్రజాసంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. అటవీ ఖనిజ సంపదను అంభానీ, అధాని లకు కట్టబెట్టే కుట్రలో భాగంగానే మావోయిస్టుల పేరుతో ఆదివాసీలపై దాడులకు పాల్పడుతున్నట్లు వారు పేర్కొన్నారు. స్థానిక సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఎరుకల హక్కుల పోరాట సమితి నాయకుడు ఎన్. మోహన్ కుమార్ ధర్మ అధ్యక్ష్యతన మారణకాండకు వ్యతిరేకంగా మాట్లాడుకుందాం రండి అనే కార్యక్రమాన్ని ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌర హక్కుల సంఘం ఉమ్మడి ప్రకాశం జిల్లా సెక్రటరీ వీరాంజనేయులు మాట్లాడుతూ మధ్య భారతంలోని చత్తీస్ గడ్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులతో కుమ్మక్కై ఆదివాసీలను అడవికి దూరం చేసే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. గత 18 నెలల నుంచి మావోయిస్టుల పేరుతో ఆదివాసులను హననం చేయ మంటే రాజ్యాంగాన్ని కాలరాయడమే అవు తుందన్నారు. ఆదివాసీలపై జరుగుతున్న సైనిక దాడులను వ్యతిరేకిస్తూ, ఆదివాసీలపై జరుగుతున్న మానవహణాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. అటవీ ఖనిజ సంపదను ప్రభుత్వ మద్దతుతో దోచుకుంటున్న బహుళ జాతి కంపెనీలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఆదివాసీలపై జరుగుతున్న సైనిక దాడులను వ్యతిరేకిస్తూ దేశపౌరులుగా, ప్రజా స్వామ్యవాదులుగా ఆదివాసీలకు మద్దతు ఇవ్వాలన్నారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ మధ్యభారతంలోని చత్తీస్ గడ్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాలలోని సహజ వనరులైన ఖనిజ సంపదను భవిష్యత్తు తరాలకు అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యం కాపాడుకోవడం కోసం ఆదివాసీలు అడవులను, అడవిలో ఉన్న ఖనిజ సంపదను కాపాడుతున్నట్లు తెలిపారు. బహుళ జాతి కంపెనీలతో దోచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర చేనేత జన సమాఖ్య నాయకులు మాచర్ల మోహన్ రావు, బీసీ ఫెడరేషన్ నాయకుడు ఊటుకూరి వెంకటేశ్వర్లు,మాజీ ఎంపిపి దామర్ల శ్రీ కష్ణ, శీలం రవి,జిలాని,బీసీ నాయకులు గుంటూరు మల్లికార్జునరావు, కుంచాల పుల్లయ్య, అర్జున్ రావు, సీనియర్ సిటిజన్ నాయకులు హరిహరరావు, శర్మ,గాదె హరిహరరావు, బడుగు విమలాకర్, వైసిపి నాయకులు రాజ్ కుమార్, గోశాల అశోక్, పాస్టర్లు పాల్గొన్నారు.

బిఎల్‌ఒల పాత్ర కీలకం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-బాపట్ల

ఓటర్ల జాబితా రూపకల్పనలో బిఎల్‌ఒల పాత్ర కీలకమని ఆర్‌డిఒ గ్లోరియా తెలిపారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో బిఎల్‌ఒలకు ఓటర్ల జాబితా తయారీపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దష్ట్యా ఓటర్ల జాబితా రూపొందించడంలో బిఎల్‌ఒలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వెయ్యి ఓట్లు దాటితే రెండో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఓట్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఉంటే వారందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. బాపట్ల నియోజకవర్గంలో మహిళా ఓటర్ల సంఖ్య అధికంగా ఉందన్నారు. వివాహమైన మహిళలు అత్తవారింటికి వెళ్లిన తర్వాత వారి పేర్లు ఇక్కడి జాబితాలో ఉంటే తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి, బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం, తహశీల్దార్లు షేక్ సలీమా, సుందరమ్మ, వెంకటేశ్వరు. ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆట్ల బాలాజీ రెడ్డి, సిఐటియు నాయకుడు శరత్, బిఎస్‌పి నాయకుడు కాగిత కోటేశ్వరరావు, వైసిపి నాయకుడు మల్యాద్రి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు దోనేపూడి రవి, జనసేన నాయకులు, బిఎల్‌ఒలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ గ్లోరియా

అర్హులందరికీ పించన్లు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బాపట్ల

అర్హులైన లబ్ధి దారులకు తక్షణమే పెన్షను మంజూరు చేయాలని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అధికారులను ఆదేశించారు. మన వార్డు మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 3వ వార్డులో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించారు.ఈ సందర్భంగా వార్డులోని మురుగు పారుదల డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. మురుగునీటితో నిండిపోయిన సైడ్ డ్రెయిన్లో తక్షణమే పూడిక తీయించి శుభ్రం చేయిం చాలన్నారు. దోమలు ప్రబలకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు ,మాజీ అధ్యక్షులు వడ్లమూడి వెంకటేశ్వర్లు వివిధ శాఖల అధికారులు, తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - వేటపాలెం

దాతల సాయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య తెలిపారు. వేటపాలెం బస్సు షెల్టర్ వద్ద టిడిపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం ఎమ్మెల్యే కొండయ్య మంగళవారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎండలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో పాదచారులు, ప్రజలు, ఆటో డ్రైవర్లు, చిరు వ్యాపారుల దాహం తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ సజ్జ హేమలత , ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్ధన్ , చీరాల, పర్చూరు మండలాల తెలుగుదేశం, జనసేన సమన్వయకర్త పొగడదండ రవికుమార్, తెలుగుదేశం నాయకులు వీరభద్రయ్య , పల్లపోలు శ్రీనివాసరావు, శివ నాగమల్లేశ్వరి, బాలకష్ణ, నాగు తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య



రైతులతో మాట్లాడుతున్న సంఘం నాయకులు

బర్లీ పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించాలి

రైతుసంఘం, కౌలురైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని వివిధ గ్రామాల్లో సాగుచేసిన బర్లీ పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించాలని రైతుసంఘం, కౌలురైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఉప్పుగుండూరు, ఒమ్మెవరం, కండ్లగుంట, నాగులుప్పలపాడు తదితర గ్రామాల్లో పర్యటించి బర్లీ పొగాకు రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జె.జయంతిబాబు మాట్లాడుతూ గతేడాది పొగాకు ధరలు ఆశాజనకంగా ఉండటంతో అత్యధికంగా రైతాంగం ఎక్కువమంది కౌలుకు తీసుకొని బర్లీ పొగాకు సాగు చేపట్టారరన్నారు. దిగుబడులు తగ్గడంతో పాటు ధరలు కూడా పతనమవడంతో నష్టాల బాట పట్టారన్నారు. ఏ రైతును పలకరించినా కన్నీటి పర్యమంతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే నిధులు కేటాయించి.. రైతుల వద్ద ఉన్న బర్లీ పొగాకు మొత్తం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో బర్లీ పొగాకు కొనుగోలు చేసేంతవరకు రైతుసంఘాల ఆధ్వర్యంలో రైతులు, కౌలు రైతులందరినీ సమీకరించి చేపట్టే ఆందోళనకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

సర్వేలను త్వరగా పూర్తిచేయాలి..

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



కలెక్టర్ వెంకటమురళి

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నిర్వహించే సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని వీక్షణ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ,వార్డు సచివాలయాల ద్వారా నిర్వహించే వివిధ సర్వేలపై ఆయన ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన మనమిత్ర వాట్సాప్ సేవ పోర్టల్ ద్వారా ప్రజలు ప్రభుత్వ సేవలను పొందేందుకు రిజిస్ట్రేషన్ చేయించాలని ఆయన ఎంపీడీవో లను ఆదేశించారు. సచివాలయ సిబ్బంది వారి పరిధిలోని క్లస్టర్లలో ఇంటింటికి వెళ్లి అక్కడ వారితో మనమిత్ర యాప్ ద్వారా కలిగే ప్రయోజనాలు తెలియజేసి, వారికి కరపత్రాలు అందజేయాలని పేర్కొన్నారు. మన మిత్ర యాప్ ద్వారా 210 ప్రభుత్వ సర్వీసులు మే 1 నుండి అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఆధార్ లేని పిల్లల సర్వేలో 1091 మందికి వెరిఫికేషన్ చేయాలన్నారు. వారికి ఆధార్ ఉందా లేదా, జనన ధ్రువీకరణ పత్రం ఉన్నాయా లేదా అని చూడాలన్నారు. బర్త్ సర్టిఫికెట్లు ఉండి ఆధార్ లేని వారికి వెంటనే ఆధార్ ఎన్రోల్మెంట్ చేయాలని ఆయన తెలిపారు. బర్త్ సర్టిఫికెట్ లేని వారు ఆర్డీవో దగ్గర నుండి ధ్రువీకరణ పత్రం పొంది ఆధార్ ఎన్రోల్మెంట్ చేయాలని తెలిపారు. ఇంటి చిత్రాలు మరియు గృహాల జియో కోఆర్డినేషన్ సర్వేను వేగవంతం చేయాలని చెప్పారు. సచివాలయాల ద్వారా నిర్వహించే సర్వేలన్నింటినీ ఈ నెల 30వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆయన ఎంపీడీవోలను ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ మరియు వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాధా మాధవి, రేపల్లె డిఎల్డిఓ పద్మ, చీరాల డి ఎల్ డి ఓ పద్మావతి పాల్గొన్నారు.

రక్తహీనత లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి

- మంత్రి స్వామి - 'పోషణ్ పక్వాడ' ముగింపు ర్యాలీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ తమీమ్అన్సారియా, మంత్రి స్వామి

అనీమియా (రక్తహీనత) లేని జిల్లాగా ప్రకాశం జిల్లాను తీర్చి దిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాలు (పోషణ్ పక్వాడా) ముగింపు సందర్భంగా మంగళవారం ఉదయం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన ర్యాలీలో మంత్రి స్వామి, కలెక్టర్ ఏ.తమీమ్అన్సారియా, నగర మేయర్ గంగాడ సుజాత, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలక్రిష్ణ, ఐసిడిఎస్ పీడీ హేన సుజన, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి వెంకటేశ్వర్లు, డిఆర్డిఎ, మెప్మా పీడీలు నారాయణ, శ్రీహరి, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలక్రిష్ణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ నుండి మిని స్టేడియం వరకు సాగింది. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ బాల్యం చాలా విలువైందని, పుట్టిన ప్రతి బిడ్డ ఆరోగ్యంగా జీవించాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఆరోగ్యమైన జీవితాన్ని పిల్లలకు అందించే లక్ష్యంతో జిల్లాల్లో శిశు, మాతృ మరణాలు తగ్గించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకాశం జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువగా వున్నాయని, బాల్య వివాహాలను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 8వ తేదీ నుండి 22 వ తేదీ వరకు 15 రోజుల పాటు రోజుకొక అంశాన్ని తీసుకొని పౌష్టికాహార పక్షోత్సవాలు (పోషణ్ పఖ్వాడా) ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. కలెక్టరేట్లో చంటి బిడ్డలకు తల్లులు పాలిచ్చు గదిని ఏర్పాటుచేసుకోవడం జరిగిందన్నారు. అనీమియా (రక్తహీనత) లేని జిల్లాగా ప్రకాశం జిల్లాను తీర్చి దిద్దేందుకు అందరి సహకారంతో కషి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. తొలుత మహిళాభివద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన చంటి బిడ్డలకు తల్లులు పాలిచ్చు గదిని మంత్రి స్వామి, కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, నగర మేయర్ గంగాడ సుజాత, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలక్రిష్ణలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల వనరుల కేంద్రాన్ని మంత్రి స్వామి సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఫొటో ప్రదర్శనను మంత్రి తిలకించారు.

వైసీపీ కార్యకర్తల నిర్బంధాన్ని నిరసిస్తూ

పోలీస్‌స్టేషన్ వద్ద బైఠాయింపు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వైసిపి నాయకులు

పోలీసుల నిర్భంధంలో ఉన్న తమ కార్యకర్తలను విడుదల చేయాలని కోరుతూ వైసిపి ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవిబాబు కార్యకర్తలతో కలిసి తాలూకా పోలీస్‌స్టేషన్ వద్ద బైటాయించారు. ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో గుండాయిపాలెం ఎంపీటీసీ భర్త ఏడుకొండలుతో పాటు మరో నలుగురు వైసిపి కార్యకర్తలను గత రాత్రి 12 గంటలకు పోలీసులు నిర్భందించినట్లు ఆరోపిస్తూ మంగళవారం నాడు వైసిపి శ్రేణులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవిబాబు మీడియాతో మాట్లాడుతూ గుండాయపాలెంకు చెందిన తమ కార్యకర్తలను టీడీపీ గూండాలు దాడి చేసి గాయపరచగా.. వారు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారని, చికిత్స పొందుతున్న ఐదుగురిని తాలూకా పోలీసులు గత రాత్రి 12 గంటల సమయంలో నిర్బంధించి కనిపించకుండా చేశారని ఆరోపించారు. ఈ ఘటనతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యారన్నారు. అక్రమ నిర్బంధంలో ఉన్న వారిని వెంటనే విడుదల చేయాలని కోరుతూ పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించటంతో సీఐ అజయ్ కుమార్ సాయంత్రం లోపు వారిని కోర్టుకు హాజరుపరుస్తానని తెలిపారన్నారు. ఏడుకొండలుతో పాటు మిగతావారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సిఐను కోరారు. అక్రమ నిర్బంధంపై తాలూకా పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

– అనంతరం రవిబాబు ఎస్‌పి ఎఆర్ దామోదర్‌ను కలిసి గుండాయపాలెం వైసిపి కార్యకర్తల నిర్భంధం విషయంలో న్యాయం చేయాలని కోరారు. కేసు రిజిస్టర్ చేసి న్యాయబద్ధంగా విచారించాలని సీఐని ఎస్పీ ఆదేశించారు.

24 నుంచి సమ్మె

- గ్రామీణ సిహెచ్‌ఒలకు ఉద్యోగ భద్రత కల్పించాలి... - కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సిహెచ్‌ఒలు

డిమాండ్లు నెరవేర్చకుంటే ఈ నెల 24 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు హెచ్చరించారు. వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న సిహెచ్ఒ (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల)లను రెగ్యులర్ చేయాలని, హెచ్ ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మంగళవారం నాడు ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎన్.నిరంజన్, మందగిరి రాజేష్ ఈ ధర్నాకు నాయకత్వం వహించారు. కార్యక్రమానికి యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) మద్దతు ప్రకటించింది. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు, యూనియన్ జిల్లా కోశాధికారి జి నాగేశ్వరరావు, ఎన్‌జిఒ సంఘ జిల్లా అధ్యక్షులు మంగేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు కోటేశ్వరమ్మ మాట్లాడారు. సిహెచ్‌ఒలు 500 మందికి పైగా పాల్గొన్నారు. ఆందోళనలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్ బాబు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.



భూములు పరిశీలిస్తున్న జేసీ, ఆర్డీవో, ఎమ్మార్వో

డెయిరీ భూముల పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం భూములు అన్యాక్రాంతం అవుతున్నాయన్న వార్తల నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ గోపాలకష్ణ రోణంకి, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, సంతనూతలపాడు తహశీల్దార్ ఆదిలక్ష్మి, సర్వే మరియు భూ రికార్డుల శాఖ అధికారులు సదరు డెయిరీ భూములను మంగళవారం నాడు పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం భూములను అత్యవసరంగా సర్వే చేసి వాటి హద్దులను, హద్దురాళ్ళను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కొంతమంది తమకు పేర్నమిట్ట సర్వే నెంబర్ 140లో ఇంటి ఎలివేషన్ నివేశన స్థలాలను రిజిస్టర్ డాక్యుమెంట్ల ద్వారా కొనుగోలు చేశామని జాయింట్ కలెక్టర్‌ని సంప్రదించగా వారి డాక్యుమెంట్లను తీసుకొని పరిశీలించి.. తగు చర్యలు తీసుకోవాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

మొదటి సెమిస్టర్ డిగ్రీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు డిసెంబర్-2024లో నిర్వహించిన మొదటి సెమిస్టర్ యూజి పరీక్షల ఫలితాలను ఏ.కే.యూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు, ఏ.సి.ఈ డాక్టర్ ఏ.భారతీదేవి మంగళవారం విడుదల చేశారు. ఆంధ్ర కేసరి యూనివర్శిటీ పరిధిలో ఉన్న 88 కళాశాలల నుంచి మొత్తం 8114 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, వీరిలో 3956 మంది విద్యార్థులు 48.76 శాతం మేరకు ఉత్తీర్ణత సాధించినట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ మూర్తి తెలిపారు. ఫలితాలను యూనివర్శిటీ రిజల్ట్స్ లింకు ద్వారా తెలుసుకోవచ్చని ఏ.కే.యూ అదనపు పరీక్షల నియంత్రణ అధికారిణి డాక్టర్ అంచుల భారతీదేవి పేర్కొన్నారు. విద్యార్థులను వి.సి డి.వి.ఆర్.మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు అభినందించారు. కార్యక్రమంలో సి.డి.సి డీన్ అండ్ డి.ఓ.ఏ ప్రొఫెసర్ సోమ శేఖర, సి.ఈ. డాక్టర్ కే.వి.ఎన్. రాజు,పి.జి అండ్ ప్రొఫెషనల్ కోర్సెస్ నాన్ కాన్ఫిడెన్షియల్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్ శ్రీనివాస్,ఏ.సి.ఈ సహాయకులు డాక్టర్ ఎన్.సురేష్ తో బాటు పరీక్షా విభాగపు సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ దరఖాస్తుల గడువు పొడిగింపు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ దరఖాస్తుల గడువు ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత రక్షణ శాఖ వివిధ దళాల రిక్రూట్మెంట్లో నూతనంగా ప్రవేశపెట్టిన అగ్ని వీర్ పథకంలో భాగంగా ఆర్మీలో ఉద్యోగాల ప్రకటన జారీ అయిందని కలెక్టర్ తెలిపారు. అగ్ని జనరల్ డ్యూటీ, అగ్ని వీర్ టెక్నికల్, అగ్ని వీర్ ఆఫీస్ అసిస్టెంట్, స్టోర్ కీపర్ టెక్నికల్ అగ్ని వీర్ ట్రేడేస్మేన్ విభాగాలలో ఉద్యోగ నియామకాలు జరుగుతున్నాయని, అర్హులైన యువత నుండి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారని తెలిపారు. ఈ ఉద్యోగ నియామకానికి రాత పరీక్షను ఆన్లైన్ ద్వారా జూన్ 2025న నిర్వహించడం జరుగుతుందని, తెలుగు భాషతో పాటు 13 భాషల్లో పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - రేపల్లె

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, కార్మికులను వేధింపులకు గురి చేస్తున్న అధికారుల చర్యలను ఖండిస్తూ పురపాలక సంఘం కార్యాలయం వద్ద ఎఐటియుసి ఆధ్వర్యంలో మంగళవారం అమర నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ దీక్షల్లో ఎఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు ఈ నాగాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ మాట్లాడుతూ పోరాటమే సమస్యల పరిష్కారానికి మార్గమన్నారు. ప్రజలు ఆరోగ్యంగా జీవించేందుకు తమ ఆరోగ్యాలను సైతం లెక్క చేయకుండా పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని బాలాజీ విజ్ఞప్తి చేశారు. కార్మికుల ఆమరణ దీక్షకు జై భీమ్ రావ్ భారత్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దోవా రమేష్ రాంజీ మద్దతు తెలిపి మాట్లాడారు. పారిశుధ్య కార్మికుల హక్కుల సాధన కోసం రాజ్యాంగంలో రూపొందించిన చట్టాలను అమలు చేయడంలో ప్రభుత్వాలు, అధికారులు విఫలం చెందుతున్నారని ఆరోపించారు.



మాట్లాడుతున్న బాలాజీ

ఫలించిన చర్చలు స్పందించిన అధికారులు

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో ఎఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు పి. నాగాంజనేయులు చేపట్టిన ఆమరణ నిరాహారదీక్షలకు రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివ ప్రసాద్ స్పందించారు. మున్సిపల్ కమిషనర్ కె. సాంబశివరావు, కార్మికుల నాయకులతో చర్చలు జరిపారు. సమస్యల పరిష్కారానికి అధికారులు సానుకూలంగా స్పందించారు. సమస్యలను స్వతరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో దీక్షలను విరమించారు. ఈ సందర్భంగా అనగాని శివ ప్రసాద్, కమిషనర్ సాంబ శివరావు, యూనియన్ నాయకులకు, తమకు మద్దతును తెలియజేసిన జై భీమ్ రావ్ భారత్ పార్టీ ప్రతినిధులకు, పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి సివి. మోహనరావుకు పారిశుధ్య కార్మికులు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిరంశెట్టి శ్రీనివాసరావు, చొక్కాకుల శివశంకర్, ఎం.దుర్గారావు, కట్టా వెంకట నారాయణ, ఏసుబాబు, రాజ్యలక్ష్మి, ధనాల అరుణ, కుసుమ పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి : సిడిపిఒ

ప్రజాశక్తి-పర్చూరు

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషక విలువలు కలిగిన ఆహారపదార్థాలను తీసుకోవాలని సిడిపిఒ జి. సుభద్ర తెలిపారు. పోషణ పక్వాడ వారోత్సవాల ముగింపు సందర్భంగా గర్భిణులకు మంగళవారం సీమంతాలు నిర్వమించారు. పిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారంలో తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో తయారు చేసిన ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. ఎస్ఐ మాల్యాద్రి మాట్లాడుతూ మూడు నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పోషక విలువలతో కూడిన ఆహారం, విద్యను ప్రతి ఉపయోగించుకోవాలని కోరారు. ఎంపిఎం రామకృష్ణ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు ఓర్పు ,సహనంతో చిన్నపిల్లలను సంరక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇ శివ నాగరాజు ,ఉప్పుటూరు హోమియో డాక్టర్ చంద్రశేఖర్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.


గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న సిడిపిఒ

ఇంకొల్లు : పోషక పక్వాడ ముగింపు సందర్భంగా ఇంకొల్లు-3 అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీలకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్ వైజర్ వందనకుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బేబీ, వాణి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి-వేటపాలెం

విద్యార్థుల చదువులు పట రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య తెలిపారు. వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ పరిధిలోని మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో నూతనంగా నిర్మించిన బాత్ రూమ్స్ ,వాష్ రూమ్స్ను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వేసవి సెలవుల అనంతరం పాఠశాలల ప్రారంభానికి ముందే అన్ని వసతులపై దృష్టి సారించినట్లు చెప్పారు ఈ కార్యక్రమంలో తహశీల్దారు పి. పార్వతి ఎంపీడీవో రాజేష్ బాబు, ప్రిన్సిపల్ నారాయణస్వామి, ఆప్కో చైర్మన్ సజ్జ హేమలత, ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్ధన్, చీరాల పర్చూరు మండలాల తెలుగుదేశం, జనసేన సమన్వయకర్త పొగడదండ రవికుమార్, వీరభద్రయ్య, వెంకటరావు, పూర్ణ, బాలచంద్ర, బాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

ఆరోగ్య సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి క్లస్టర్ పరిధిలోని మోదేపల్లి, కొరిశపాడు, ప్రాసంగలపాడు, మేదరమెట్ల, కాకానిపాలెం, గాజులపాలెం అద్దంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఎఎన్ఎంలు, ఎంసిహెచ్ఎపిఎస్ మరియు సూపర్వైజర్లకు మంగళవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ మనోజ్ ప్రజత్, జిల్లా కుటుంబ సంక్షేమ గణాంక అధికారి వేణు ఆయుష్మాన్ ఆరోగ్యం మందిరం మరియు హెల్త్ వెల్నెస్ సెంటర్ యొక్క ఇన్ఫ్రాస్ట్రక్చర్, హెల్త్ మేజనేమెంట్, ఆర్సిహెచ్ పోర్టల్ గురించి శిక్షణ ఇచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సేవలు, హెల్త్ వేకెన్సీ సెంటర్లోని సేవలు, వ్యాధి నిరోధక టీకాలు, కుటుంబ సంక్షేమ సేవలు, రక్తహీనత మరియు జనన, మరణాల నమోదు గురించి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీహర్ష, బాలరాజు, హరికష్ణ, జయసింహ, అనీష్, అక్షిత తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అధికారులు


దావత్ రెస్టారెంట్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి - చీరాల

రెస్టారెంట్ నిర్వాహకులు ఆహార భద్రత ప్రమాణాలు పాటించకుండా ఇష్టా రీతిగా వ్యవహరిస్తే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని ఉమ్మడి ప్రకాశం జిల్లా ఆహార భద్రత తనిఖీ అధికారి ప్రభాకర్రావు హెచ్చరించారు. చీరాల పట్టణంలోనే పలు రెస్టారెంట్లల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెస్టారెంట్ల్లోని ఆహారాన్ని, మాంసాన్ని, టెస్టింగ్ సాల్ట్, వివిధ రకాల ఆహార పదార్థాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఐసి సమీపంలోని దావత్ రెస్టారెంట్లో నిర్వాహకులు నిర్లక్ష్య పూరితంగా వ్యవహరిస్తున్నారని గుర్తించామన్నారు. ఆహార పదార్థాలలో టెస్టింగ్ సాల్ట్ ను వినియోగించడంతోపాటు చికెన్ వింగ్స్కు కలర్ వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ రెస్టారెంట్లోని మాంసాన్ని ల్యాబ్కు పంపుతున్నట్లు తెలిపారు. వచ్చిన నివేదికను బట్టి క్రిమినల్ కేసు లేక ఇతర చర్యలు ఉంటాయని తెలిపారు. పట్టణం లోని మిస్సమ్మ రెస్టారెంట్లోనూ టెస్ట్ సాల్ట్ను వినియోగిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ ఇన్స్పెక్టర్ ప్రణీత్ పాల్గొన్నారు.


పుస్తకాలు అందజేస్తున్న దాత

పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - చీరాల

మండల పరిధిలోని గవినివారిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన లైబ్రరీలకి రాఘవేంద్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్ సెక్రటరీ మరియు కరస్పాండెంట్ గవిని మణికుమార్ మంగళవారం పుస్తకాలు అందజేశారు. అదేవిధంగా సిఎం చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకొని గ్రామం లో చలివేంద్రము ఏర్పాటు చేశారు. లైబ్రరీలకు వెర్బల్ మరియు నాన్ వెర్బల్ రీజనింగ్ మరియు క్వాంటిటేటివ్ యాటిట్యూడ్ అర్థమెటిక్, మహా భాగవతం తదితర పుస్తకములను అందజేశామన్నారు. ఈ పుస్తకాలను గ్రామ పెద్దలు గవిని మేకల పోలయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జంగిల్ గోపి, గవిని శాలెం రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపల్, తదితరులు

సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి-పర్చూరు : మండల పరిధిలోని నాగులపాలెంలోని డాక్టర్ బిఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో వత్తి శిక్షణ కోర్సును పూర్తి చేసిన విద్యార్థులకు సర్వ శిక్ష అభియాన్ ద్వారా వచ్చిన సర్టిఫికెట్లను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ విశ్వ రాణి మాట్లాడుతూ గురుకులం పాఠశాలలో విద్యార్థినులకు చదువుతోపాటు ఉత్పత్తి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 9వ తరగతి నుంచి ఇంటర్ చదివే పిల్లలకు కంప్యూటర్ కోర్సు, బ్యూటీషియన్ అండ్ విల్నెస్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. తద్వారా విద్యార్థినుల బంగారు భవిష్యత్కు బాట పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒకేషనల్ కోఆర్డినేటర్ సత్య నారాయణ,ఉపాధ్యాయులుసౌజన్య, సుప్రియ పాల్గొన్నారు.


బహుమతులు సాధించిన విద్యార్థులు

విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి-అద్దంకి : అద్దంకి పట్టణంలోని చైతన్య స్కూల్ విద్యార్థులు ఐఎన్టిఎస్ఒ లెవెల్-2 పరీక్షలలో ప్రతిభ చూపి బహుమతులు సాధించినట్లు స్కూల్ వైస్ ప్రిన్సిపల్ అంజుమ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తోట రోహిత్ ముదిరి ప్రథమ బహుమతిగా ల్యాప్టాబ్, ఆళ్ల ఆశ్రిత మూడో తరగతి విద్యార్థి ట్యాబ్ను సొంతం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరు ద్వితీయ, ఇద్దరు తృతీయ, నాల్గవ బహుమతి ఇద్దరు, ఐదో బహుమతి ముగ్గురు, ప్రత్యేక బహుమతులు 8 మంది, బంగారు పతకాలు 100 మంది, సర్టిఫికెట్లు 159 సాధించినట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. రవీంద్రబాబు చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎజిఎం అంజయ్య, అజీల్ కుమారి, శ్రీనివాసరావు, కోటయ్య, గిరిబాబు, విజయలక్ష్మి, సురేఖ, రాధ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధరిత్రి దినోత్సవం

ప్రజాశక్తి - బాపట్ల


రోజురోజూకు అధికమవుతున్న భూతాపం వల్ల కొన్నాళ్లకు భూగోళం మనుగడ ప్రశ్నార్ధకమవుతుందని జిల్లా అటవీ శాఖ అధికారి ఎల్ .భీమయ్య తెలిపారు. స్థానిక ఎస్ఎం జి జూనియర్ కళాశాలలో ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ధరిత్రి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమయ్య మాట్లాడుతూ సహజ వనరులను హరిత జీవనశైలిని అలవర్చుకోవాలన్నారు. భూమిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందన్నారు. సహజ వనరులను విచ్చలవిడిగా కొల్లగొట్టడం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జి. దుర్గా ప్రసాదరావు, ఫోరం కార్యదర్శి డాక్టర్ పిసి. సాయిబాబు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాగమణి, హైస్కూల్ హెచ్ఎం రమాదేవి, అధ్యాపకులు అబ్దుల్ కలాం, భాస్కర రావు, చిత్రకారుడు జివి, సీనియర్ సిటిజన్స్ నాయకులు దేవవరం, జివి.బ్రహ్మం, నరసింహారావు, సత్యనారాయణ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలందరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని శాసనమండలి మాజీ సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్ తెలిపారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా బాపట్ల మండలం స్టువర్టుపురం గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సతీష్ ప్రభాకర్ మాట్లాడుతూ రహదారుల వెంబడి మొక్కలు నాటడం ద్వారా నీడనివ్వడంతో పాటు పచ్చని చెట్లు పర్యావరణానికి మేలు చేస్తాయన్నారు.



అద్దంకిలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వేటపాలెం : జీవ వైవిధ్యం, మానవ పరిరక్షణ కోసం చర్యలు చేపట్టాలని ప్రధానోపాధ్యాయుడు ఎం. శేఖర్ రావు తెలిపారు. మండల పరిధిలోని పందిళ్ళపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు ధరిత్రి దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖరరావు మాట్లాడుతూ అడవులను నరికి వేయడం వలన, ఫ్యాక్టరీల కాలుష్యం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించడం వల్ల, మోటార్ వాహనాల వినియోగం ఎక్కువ కావడం, గనుల తవ్వకం వాతావరణ కలుషితం అవుతున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు భూగోళం కాలుష్యం పరిరక్షణలో మానవుడి యొక్క పాత్ర అనే అంశంపై డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు బత్తుల నీలిమ, ఆకురాతి నిర్మల, సప్రం కల్పన, కె.సంతోషం, యం. రాజేశ్వరిని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ బుద్ధిమోహన్ రావు, యస్.లలితా పరమేశ్వరి, ఉమ్మిటి వేణుగోపాలరావు, సిహెచ్. భవానీ దేవి, కటకం నారాయణ, వై.రత్నం, గుంటూరు శివశంకర్ , నాగరాజు, బుద్ధి ప్రసన్నాంజనేయులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వేటపాలెంలో ఉపాధ్యాయులకు సన్మానం

అద్దంకి :మండల పరిధిలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేషనల్ ఎర్తడే (ధరిత్రి దినోత్సవాన్ని)ను మంగళవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చీరాల డిప్యూటీ డిఇఒ గంగాధర్, అద్దంకి-1 ఎంఇఒ సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఇఒ గంగాధర్ మాట్లాడుతూ ప్రతి స్కూల్ రిజిస్ట్రేషన్ కావాలన్నారు. రిజిస్ట్రేషన్ ఎలా అవ్వాలి, అనే విషయం గూర్చి వీడియో పోస్ట్ చేశారు. ఈ వీడియో చూసి కార్యక్రమం జరిపించాలన్నారు. అద్దంకి-2 ఎంఇఒ సుధాకర్ మాట్లాడుతూ నేషనల్ ఎర్త్‌డేను ప్రతి సంవత్సరం ఏప్రిల్ 22న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేషనలర్ ఎర్త్‌డే భూమిని సంరక్షించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి గంగాధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిఆర్‌పి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి : ప్రకృతి ప్రసాదించిన పర్యావరణాన్ని కాపాడు కోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అకడమిక్ డైరెక్టర్ వందన శర్మ తెలిపారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ, వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐడిపిఎస్ గ్రూప్స్ చైర్మన్ పైనం ఏడుకొండలు రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మరియు విద్యార్థులకు చిన్నతనం నుంచే భూమి, గాలి, నీరు, ఆకాశం ,చెట్లు పర్యావరణంపై అవగాహన పెంపొందించేందుకు సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది మరియు మేనేజ్ మెంట్ సుభాష్ చంద్ర బోస్ , శివ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



చెరుకుపల్లిలో విద్యార్థుల ర్యాలీ

ప్రకృతి వ్యవసాయంతో లాభం

ప్రజాశక్తి- పర్చూరు

రైతులు ప్రకృతి వ్యవసాయం సాగు పట్ల మొగ్గు చూపాలని పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్. మోహనరావు తెలిపారు. మండల మహిళా సమైఖ్య కార్యాలయంలో ప్రకతి వ్యవసాయంపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ ప్రకతి వ్యవసాయంతో అధిక లాభాలు సాధించ వచ్చునని తెలిపారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంట ఉత్పత్తులు వస్తాయని తెలిపారు. అనంతరం ఆదర్శ రైతులు వెంకటేశ్వర్లు, దావూద్ సాహెబ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం రామకష్ణ, వ్యవసాయ శాఖ అధికారులు మల్లేశ్వరి ,శ్రీనివాస రావు, వెలుగు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మేదరమెట్ల : ప్రకృతి వ్యవసాయం సాగులో మహిళలు కీలక పాత్ర పోషించాలని అద్దంకి వ్యవసాయ సహాయ సంచాలకులు కె.ధనరాజ్ తెలిపారు. 2025- 26 సంవత్సరానికి గాను ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ తయారీపై మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కొరిశపాడు లోని ఐకెపి కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధనరాజ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం సాగు చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించ వచ్చునని తెలిపారు. ఎఒ పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయడం ద్వారా భూసారం పెంచుకోవచ్చునని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం సాగు చేసి అధిక లాభాలు సాధిస్తున్న రైతు ఈమని కష్ణారెడ్డిని సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎపిఎం పి.మ్మాణిక్యరావు, సిసిలు వై. సాంబయ్య, మేరీ, యానిమేటర్స్ ,ఎం.ఎఫ్ఎంటిఎస్ ట్రైనర్స్ ,అశోక్, రవికుమార్, ఎటిఎం రామిరెడ్డి పాల్గొన్నారు.

వందేభారత్ రైలును బాపట్లలో ఆపాలి

ప్రజాశక్తి-బాపట్ల

సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు బాపట్లలో స్టాప్ కల్పించాలని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్‌ను 2024లో తాము కోరినట్లు బాపట్ల పౌర సమాఖ్య సభ్యులు కారుమంచి విజయకుమార్ తెలిపారు. పట్టణంలోని నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం భవనంలో పౌర సమాఖ్య నాయకుల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశ: నిర్వహించారు. ఈ సమావేశంలో విజయకుమార్ మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన బాపట్ల ప్రాంత ప్రయాణికుల సౌకర్యార్థం వందే భారత రైలు బాపట్ల స్టేషన్ నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో బాపట్లలో స్టాపింగ్ ఉన్న జిటిఎక్స్ ప్రెస్ రైలు హాల్ట్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. ఆ రైలు బాపట్లలో నిలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉప్పరపాలెం, కంకటపాలెం గేట్ల వద్ద ఆర్ఒబిలు, పరిమిత అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పౌర సమాఖ్య సభ్యులు, జమద్ బాషా, కందుల రమణకుమార్, జి. వేంకటేశ్వర్లు, పి.సి.శాయిబాబు, తోట రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న విజయ్ కుమార్

ఉర్దూ పాఠశాలను తొలగించొద్దని ర్యాలీ

ప్రజాశక్తి- మార్టూరు

మండల పరిధిలోని వలపర్ల గ్రామంలో నున్న ఉర్దూ పాఠశాలను తొలగిస్తున్నారంటూ వార్తలు నేపథ్యంలో పాఠశాలను కొనసాగించాలని కోరుతూ విద్యార్థులు, స్థానికులతో కలిసి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రులు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు బాలికా విద్యను ప్రోత్సహిస్తున్నట్లు ప్రకటనలు చేస్తూ బాలికలు అభ్యసిస్తున్న ఉర్దూ పాఠశాలను తొలగించటం ఏమిటని వారు ప్రశ్నించారు. గత మూడు దశాబ్దాలుగా ఉన్న ఉర్దూ పాఠశాలను తొలగించడం అన్యాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ షేక్ మస్తాన్‌వలి, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

పైపులైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలులోని 6,7 వార్డుల పరిధిలో వెల్లటూరు కాలువ ప్రక్కన తెనాలి సారమ్మ ఇంటి వద్ద మరియు మోటార్ షెడ్ ప్రక్కన మెయిన్ పైప్ లైన్ పగిలిపోయింది. పగిలిపోయిన పైపులైన్‌ను మంగళవారం మరమ్మతులు పూర్తి చేసినట్లు గ్రామ సర్పంచి రవికిర్మణయి చెన్నయ్య తెలిపారు. పైపులైన్ మరమ్మతు పనులను గ్రామ సర్పంచి దారా రవి కిర్మణయి, ఉపసర్పంచి బూరెల రాంప్రసాద్, పంచాయతీ సెక్రెటరీ కోట శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ పర్యవేక్షించారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో విచారణ

ప్రజాశక్తి-మార్టూర్టు

మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటీవల జరుగుతున్న వరుస సంఘటనలపై అధికారులు మంగళవారం విచారణ జరిపారు. ఇటీవల విధి నిర్వహణలో ఉన్న చిన్న పిల్లల వైద్యుడిపై, ఒపి విభాగంలోని నర్సుపై దాడి చేసిన విషయం తెలిసిందే. పిల్లల వైద్యుడు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న క్రమంలో ఆయన రెన్యువల్ విషయమై కూడా విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన సివిల్ సర్జన్ మరియు మెడికల్ సూపరిండెంట్ సి.అరుణ్ కుమార్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఫణి భూషణ్ మార్టూరు ఆసుపత్రి వైద్యులు సిబ్బందిని విచారించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ విచారణ సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు పంపనన్నట్లు విచారణ అధికారులు తెలిపారు. తెలిపారు.

పంగులూరు మండలంలో 12 ఆదర్శపాఠశాలలు

ప్రజాశక్తి- పంగులూరు

రానున్న విద్యా సంవత్సరంలో మండలంలో నూతనంగా మూడు ఉన్నత పాఠశాలలో 12 ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు కానున్నాయి. గత వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 117 జీవోను రద్దుచేసి దాని స్థానంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విధానంలో పాఠశాల రూపు రేఖలు మారనున్నాయి. రేణింగవరం, కొండమూరు, కోటపాడు గ్రామాల్లోని ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్డేట్ చేశారు. పంగులూరులో రెండు, అలవలపాడులో రెండు ,రామకూరు, కొండ మంజులూరు ,ముప్పవరం ,రేణింగవరం, కొండమూరు ,కోటపాడు ,కల్లం వారి పాలెం, బూదవాడ గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు ఆయా గ్రామాల్లో విద్యార్థుల సంఖ్యను అనుసరించి పది చోట్ల ఫౌండేషన్ పాఠశాలలు, 14 చోట్ల బేసిక్ పాఠశాలలు ఏర్పాటు కానున్నాయి. బేసిక్ పాఠశాలల్లో ఐదు తరగతులు కొనసాగనుండగా ఇందులో ఇద్దరు ఉపాధ్యాయులు నియామకం ఉంటుంది. ఫౌండేషన్ పాఠశాలల్లో ఒకటి రెండు తరగతులు మాత్రమే నిర్వహించనుండగా విద్యార్థుల సంఖ్యను అనుసరించి 1 లేదా ఇద్దరు ఉపాధ్యాయులను నియమిస్తారని విద్యాశాఖ అధికారులు తెలిపారు. నూజీలపల్లి తూర్పు కొప్పెరపాడు గ్రామాల్లోని ప్రాథమి కోన్నత పాఠశాలలు యధావిధిగా కొనసాగు తాయని ఎంఇఒ నాగభూషణం, వీరాంజనేయులు తెలిపారు.

నేడు చప్టా నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- భట్టిప్రోలు

మండల పరిధిలోని బియ్యం డ్రైన్‌పై ఉన్న వెల్లటూరు ఛానల్‌పై నూతన చప్టా నిర్మాణానికి వేమూరు ఎమ్మెల్యే ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు బుధవారం శంకుస్థాపన చేయనున్నట్లు నీటి సంఘం అధ్యక్షుడు వై. కరుణ శ్రీనివాసరావు తెలిపారు. ఇక్కడ బ్రిటిష్ కాలంలో నిర్మించిన చప్టా శిథిలావస్థకు చేరి గత నవంబర్‌లో కూలిపోయిన విషయం పాఠకులకు విధితమే. దాని స్థానంలో నూతన చప్టా నిర్మాణానికి ప్రభుత్వం రూ.10.70 కోట్లు మంజూరు చేసింది. అందులో భాగంగా బుధవారం శంకుస్థాపన చేస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

భావితరాల కోసం ప్రకృతిని కాపాడుకోవాలి

ఎస్పీ తుషార్ డూడి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రతిఒక్కరూ స్వీయ క్రమశిక్షణ పాటిస్తూ సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని జిల్లా ఎస్పీ తుషార్‌డూడి ప్రజలకు సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో చెరుకుపల్లిలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కు చెందిన విద్యార్థులు, నిర్వాహకులు జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. జిల్లా ఎస్పీ పాఠశాల విద్యార్థులు, నిర్వాహకులు ఏప్రిల్ 22 తేది వరల్డ్ ఎర్త్ డే పురస్కరించుకొని ప్రజలకు పర్యావరణ స్పృహ బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వరల్డ్ ఎర్త్ డే సందర్భంగా ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు నిర్వాహకులు కలిసి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యత ప్రజలకు గుర్తు చేసే విధంగా అనేక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల భూమి పై కాలుష్య సమస్య తీవ్రంగా మారిపోయిందన్నారు. ఇది ప్రకృతికి ఎంతో హాని కలిగిస్తుందన్నారు. భూమిని రక్షించడం మన బాధ్యత ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు జీవనశైలిలో మార్పులు తీసుకురావాలన్నారు. భావితరాల భవిష్యత్తును దష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ స్వీయ క్రమశిక్షణ పాటిస్తూ సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. వాటి స్థానంలో త్వరగా భూమిలో కలిసిపోయే పదార్థాలతో తయారుచేసే కవర్ లు, సంచులను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నిర్వాహకులు ఏడుకొండలు రెడ్డి, వందన శర్మ, సుభాష్ చంద్ర బోస్, శివ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నిర్వాహకులను అభినందిస్తున్న ఎస్పీ

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు చర్యలు

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం నుండి 30 వేల మెట్రిక్ టన్నుల అదనపు లక్ష్యాలను సాధించడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలు చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ వ్యవసాయశాఖ అధికారులు, మార్కెటింగ్ శాఖ అధికారులు, రైతుసంఘాల ప్రతినిధులు, రైతులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ మరియు లేట్ ఖరీఫ్, రబీ సీజన్లతో కలిపి లక్షా 80 మెట్రిక్ టన్నులు వరి ధాన్యం దిగుబడులు వచ్చాయన్నారు. ప్రభుత్వం జిల్లాలో 30 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని చెప్పారు. బాపట్ల నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే రైతుల నుండి 47 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయన్నారు. బాపట్ల నియోజకవర్గంలో రైతులు వద్ద మరో 47 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం నిల్వలు ఉన్నాయని అన్నారు. ప్రస్తుతం రైతులు పండించిన వరి ధాన్యం పదివేల మెట్రిక్ టన్నులు రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామాలలో రైతు సేవా కేంద్రాలకు ముందుగా ధాన్యం తెచ్చిన రైతుల నుండి ముందుగా పంట కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. రాబోయే సీజన్‌లో 5204 బి.పి.టి రకం పంటలు రైతులు సాగుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు వరి ధాన్యంలో కొత్త రకాలు పండించే విధంగా వ్యవసాయ శాఖ అధికారుల నుండి సూచనలు, సలహాలు తీసుకోవాలని చెప్పారు. రైతులు ఒకే రకమైన పంటలు కాకుండా పంట మార్పిడి విధానానికి వెళ్లాలని సూచించారు.

బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గంలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తామని చెప్పారు. బాపట్ల నియోజకవర్గంలో ఖరీఫ్, లేట్ ఖరీఫ్, రబీ తో కలిపి 50 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయవలసి ఉందన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జిల్లా మంత్రులతో కలిసి జిల్లాకు మరో 30 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయడానికి అదనపు లక్ష్యాలను ఇవ్వవలసిందిగా కోరతామని చెప్పారు. రాబోయే సీజన్‌లో డిమాండ్ మేరకు వరి సాగును చేయాలని ఆయన రైతులను కోరారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకష్ణ, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రమేష్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

మోడల్ ఇఏపీ సెట్ విజయవంతం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఎస్ఎఫ్ఐ నిర్వహించిన ఇఏపీ మోడల్ పరీక్షకు స్పందన లభించింది. ఎస్ఎఫ్ఐ ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నాడు పేస్ ఇంజనీరింగ్ కాలేజీ నందు మోడల్ 'ఈఏప్ సెట్' నిర్వహించారు. ఈ సందర్భంగా పేస్ కాలేజీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్ ఆర్ వీరాంజనేయులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ. ఇంజనీరింగ్ విద్య వల్ల శాస్త్ర ,సాంకేతిక రంగాల్లో ఉద్యోగ అవకాశాలున్నాయని, విద్యార్థులు కష్టపడి, ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ కోర్సుల ప్రత్యేకతల గురించి విద్యార్థులకు పలు సూచనలు చేసారు.ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ వినోద్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై పోరాటాలు చేస్తూనే మరోవైపు విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే మోడల్ 'ఇఏపి సెట్' ను నిర్వహించామన్నారు. పరీక్షకు 700 మంది హాజరయ్యారని,ఈ పరీక్ష రాయడం వలన ఆన్లైన్ పరీక్షల పట్ల అవగాహన పెరిగిందని, పరీక్ష పట్ల భయం పోయిందని, మంచిర్యాంకు సాధించేందుకు ఈ పరీక్ష దోహదపడుతుందని తెలిపారు. ఎస్ఎఫ్ఐ సంఘానికి, దగ్గరుండి అనుమానాలను నివత్తి చేసిన పేస్ కాలేజీ సిబ్బందికి విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో నాయకులు దేవా, విజయ్, ప్రవీణ్, ససంత్, హేమంత్, నవీన్ పాల్గొన్నారు.


టెస్ట్ రాస్తున్న విద్యార్థులకు సూచనలు ఇస్తున్న కాలేజీ అధ్యాపకులు


ఘటన వివరాలను ఎస్పీ దామోదర్‌కు వెల్లడిస్తున్న తాలూకా సిఐ అజయ్‌కుమార్

నేర స్థలంలో ఎస్పీ పరిశీలన

- రంగంలోకి క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్
- సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న పోలీసులు
- హత్య కేసును చేధించేందుకు ప్రత్యేక పోలీసు టీముల ఏర్పాటు

ప్రజాశక్తి-ఒంగోలుక్రైం

ఒంగోలులోని పద్మ టవర్స్ దగ్గర మంగళవారం రాత్రి వీరయ్య చౌదరి హత్య జరిగిన స్థలాన్ని జిల్లా ఎస్పీ దామోదర్ పరిశీలించారు. చుట్టుపక్కల ప్రాంతాలను తనిఖీ చేశారు. అక్కడ ఉన్న ప్రజలతో మాట్లాడారు. ఈ హత్య ఎలా జరిగింది, తదితర వివరాలపై ఆరా తీశారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ లచే ఆ ప్రాంతాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయించారు. ఘటనా స్థలంలోని ఉన్న అన్ని ఆధారాలను జాగ్రత్తగా సేకరించి భద్రపరచాలన్నారు. తీవ్రమైన కేసుల్లో గుర్తుంచుకోవలసిన విషయాలు, దర్యాప్తు అవసరమైన పలు సలహాలు,సూచనలు అధికారులకు ఎస్పీ తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హత్య జరిగిన వెంటనే క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపామని, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించటం, ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేపట్టామని, దర్యాప్తు ప్రగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించటం, ఈ కేసును వీలైనంత త్వరగా చేయించడమే లక్ష్యమని తెలియజేశారు. జిల్లా ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఒంగోలు డిఎస్పీ శ్రీనివాసరావు, ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఒంగోలు టౌన్ సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు ఉన్నారు.


పరిశీలిస్తున్న డాగ్ స్క్వాడ్

నిరుపేదలకు 'ఉపాధి' కల్పించాలి

కలెక్టర్ జె.వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఉపాధి హామీ కింద అధికారులు విస్తతంగా పనులు గుర్తించి, నిరుపేదలకు జీవనోపాధి కల్పించాలని కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశించారు. ఉపాధి హామీ అనుసంధానంతో చేపడుతున్న అభివద్ధి పనులపై జిల్లా, మండల స్థాయి అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్లో ఆయన సమీక్ష నిర్వహించారు. వీక్షణ సమావేశం ద్వారా క్షేత్రస్థాయి అధికారులతోను ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో వలసలు పూర్తిగా నివారించాలంటే నిరుపేదలకు జీవనోపాధి చూపాలని కలెక్టర్ తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా అభివద్ధి పనులు విస్తతంగా చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో చెరువులు, పంట కాల్వల పూడికతీత, మరమ్మతులు చేయాలని, అభివద్ధి పనులు వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతిరోజు బాపట్ల జిల్లాలో 50 వేల పని దినాలు దాటేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్యాలకు మించి పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఏడాదిలో 73 లక్షల పని దినాలు కల్పించాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలన్నారు. నిరుపేదలకు పని కల్పిస్తే జిల్లా జిడిపి పెరుగుతుందనే విషయాన్ని అధికారులు గుర్తించాలన్నారు. యంత్రాలతో పని చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చుండూరు మండలంలో పనుల పురోగతి లేకపోవడం ఏమిటని సంబంధిత ఎంపీడీవోను కలెక్టర్ నిలదీశారు. కథలు చెప్పడంమాని, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలన్నారు. లక్ష్యాలను 50 శాతం చేరుకోలేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. యద్దనపూడి, వేమూరు మండలాలలోనూ పురోగతి లేకపోవడం ఏమిటని వివరాలు అడిగి తెలుసుకున్నారు. దొంగ మాస్టర్లు వేస్తున్నారనే ఆరోపణలు వినపడుతున్నాయని, వాటిపై విచారణ అధికారులను నియమిస్తాం, క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలిస్తానని చెప్పారు. ఉపాధి హామీ పనులలో అవినీతి, అక్రమాలు జరిగితే కఠినంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అక్రమాలకు తావులేకుండా చిత్తశుద్ధితో అధికారులు పనిచేయాలని మార్గ నిర్దేశం చేశారు.

ఉపాధి హామీ పథకం అనుసంధానంతో జిల్లా వ్యాప్తంగా 1.09 లక్షల మొక్కలు ఈ సంవత్సరంలో అధికారులు నాటించాలని కలెక్టర్ చెప్పారు. ఒక వెయ్యి ఎకరాలలో సామాజిక వనాలు ఏర్పాటు చేయాలన్నారు. 25 మండలాలలో 25 పల్లె వనాలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

తీర ప్రాంతాలలో పండ్ల మొక్కలు విస్తతంగా నాటాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. జిల్లాలోని తీర ప్రాంతం వెంట 30 వేల మొక్కలు నాటాలని, అవి పెరిగే వరకు పర్యవేక్షణ ఉండాలన్నారు. తీర ప్రాంతాలలో 40 రిసార్ట్స్ లు ఉన్నందున వాటి ఎదురుగా నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత రిసార్ట్స్ యజమానులదేన్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.

సూర్యలంక, వాడరేవు, రామాపురం తదితర బీచ్ లు సుందరీకరణ చేసి అహ్లాదాన్ని పంచే పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ఆయన చెప్పారు. ఉపాధి హామీ పనులను ఈనెలాఖరులోపు గుర్తించాలని, మే నెలలో ప్రతిపాదనలు, తదుపరి మంజూరు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జూన్ నెలలో పనులు ప్రారంభించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో కమిటీలు వేయాలన్నారు. నాలుగువేల ఇంకుడు గుంతలు నిర్మించాలని లక్ష్యం కాగా ప్రస్తుతం 1,952 ఇంకుడు గుంతలు నిర్మించడం ఏమిటన్నారు. ఉపాధి హామీ పనుల అనుసంధానంపై అధికారులకు కనీసం అవగాహన లేకపోవడం ఏమిటని పలువురిని నిలదీశారు. మీరు పనిచేస్తున్న విధుల పట్ల కనీసం అవగాహన లేకపోతే ఎలా పని చేస్తారు, నిబద్ధతతో పనిచేయాలని ఆయన మందలించారు. ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ఉద్యాన పంటలు లక్ష్యం మేరకు నాటాలని ఆయన చెప్పారు. పంట కాల్వలలో నీరు లేనప్పుడే పనులు చేపట్టాలని ఆయన సూచించారు.ఈ సమావేశంలో డ్వామా పిడి విజయలక్ష్మి , ఎంపీడీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకట మురళి